క్లుప్తంగా

హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు గడుస్తున్నా.. పోలీస్‌శాఖలో పని చేసే హోంగార్డులు, కిందిస్థాయి సిబ్బంది సమస్యలను ప్రభుత్వం ఎందుకు పరిష్కరించడం లేదని బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ బన్సీలాల్ రాథోడ్ ప్రశ్నించారు. బుధవారం ఖానాపూర్ ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మాట్లాడారు. హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించి కారుణ్య నియామకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉద్యమంలో అమరులైన పోలీసుల కుటుంబాలకు న్యాయం చే యాలని కోరారు.

'ఎంపీని అరెస్ట్ చేయాలి'

ఖానాపూర్: మహిళా రెజ్లర్లను లైంగికంగా, మానసికంగా వేధించిన ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అతడిని కఠినంగా శిక్షించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల మీద జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



స్తంభం ఏర్పాటులో సిబ్బంది

లోకేశ్వరం: మండలంలోని వట్టోలి–ధర్మోర వెళ్లే మార్గంలో రోడ్డుపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. దీనిపై ఈ నెల 7న సాక్షిలో వేలాడుతున్న ముప్పు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఏఈ శివకుమార్, ధర్మోర జేఎల్‌ఎం గంగాధర్ బుధవారం విద్యుత్ తీగలను సరిచేసి స్తంభం బిగించారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

ముధోల్: పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సీఐ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ముధోల్ పోలీస్‌స్టేషన్‌లో లోకేశ్వరం, బాసర, ముధోల్, తానూర్ మండలాల ఎస్సైలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో శాంతిభద్రతల రక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు.

పల్లెపల్లెకూ బీజేపీ

భైంసా: పల్లెపల్లెకూ బీజేపీ గడప గడపకూ మోహన్‌రావు కార్యక్రమంలో బీజేపీ నాయకులు భోస్లే మోహన్‌రావు పటేల్ బుధవారం బాసర మండలంలో పర్యటించారు. ఈసందర్భంగా మండలంలోని టాక్లి గ్రామంలో బీజేపీ జెండా ఆవిష్కరించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించారు.

దీక్షా దివస్‌కు తరలిరావాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

కుంటాల: నిర్మల్‌లో ఈ నెల 12న నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని సీపీఎం ప్రజాపంథా జిల్లా కార్యదర్శి రాజన్న అన్నారు. మండలంలోని కల్లూర్ గ్రామంలో బుధవారం ప్రజా ఆంక్షల దినోత్సవం నిర్వహించిన అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి తెలంగాణ ప్రజల నెత్తిన అప్పు రుద్దారన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఎం.బక్కన్న, కోశాధికారి ఎండీ గఫూర్, సాయన్న, హైమద్, అక్తర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బాధితుడికి చేయూత

కడెం: మండల కేంద్రానికి చెందిన మానసిక దివ్యాంగుడు చంద్రహాస్‌కు బుధవారం 'జై జవాన్..జై కిసాన్' ఫౌండేషన్ సభ్యులు రూ.ఐదు వేలు అందించి అండగా నిలిచారు. అనారోగ్యంతో బాధపడుతున్న రెండు కుటుంబాలకు ప్రతినెలా ఆర్థికసాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫౌండేషన్ సభ్యులు ఎల్లంకి భూపాల్, శంకర్, రాపర్తి వెంకటేశ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

'ఏం సాధించారని ఉత్సవాలు'

లక్ష్మణచాంద: ప్రజలకు మేలు చేసేలా ఏం సాధించారని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహిస్తోందని సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు గంగన్న అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో నిరసన చేపట్టగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కార్యాలయంలో డీటీ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని సీఎం కేసీఆర్‌కు దశాబ్ది ఉత్సవాలను జరిపే నైతిక హక్కు లేదన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, గంగామణి, పద్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

సాగునీటికి బీఆర్‌ఎస్ పెద్దపీట

- ఎమ్మెల్యే రేఖానాయక్
- కొనసాగుతున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు



ఖానాపూర్‌లో పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్, పక్కన అధికారులు, నాయకులు

ఖానాపూర్: బీఆర్‌ఎస్ హయాంలోనే చెరువుల పునరుద్ధరణ, ప్రాజెక్టుల నిర్మాణంతో సాగునీటి రంగానికి పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాగునీటి దినోత్సవ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. అంతకుముందు సంబంధిత శాఖ ఆధ్వర్యంలో చేసిన ప్రత్యేక వీడియోను ఎమ్మెల్యే తిలకించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా సాగు నీటి రంగంలో ప్రగతి ప్రవాహం పేరిట ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, అంకం రాజేందర్, కలీల్, మోహిద్, పుప్పాల శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, కట్ట శ్యాం, పుప్పాల గజేందర్, శ్రీనివాస్, సంతోష్, కిషోర్, నాగేశ్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో మల్లేశ్, ఈఈ విఠల్, డీఈఈలు సురేందర్, భోజీదాస్, ఏఈఈలు నవీన్, ఉదయ్, రవి, గణేష్, విఠల్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

పెంబి: గ్రామాల్లోని సమస్యలు పరిష్కరిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. పల్లెపల్లెకు రేఖక్క కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వేణునగర్ గ్రామంలో పర్యటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు తెలుపడంతో అక్కడే ఉన్న మిషన్ భగీరథ అధికారికి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఐటీడీఏ ద్వారా పథకాలు అందడం లేదని కలెక్టర్ వరుణ్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆత్రం రాధ, సుధాకర్, శంకర్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు, విలాస్, శంకర్, రమేశ్, సూదుల శంకర్, శ్రీను, అశోక్, శంకర్ తదితరులు ఉన్నారు.

అనుమతులు ఇప్పించండి

పెంబి మండలంలోని పుల్గంపాండ్రి నుంచి ఇచ్చోడ మండలం సిరిచెల్మ గ్రామం వరకు చేపట్టే రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ఇప్పించాలంటూ పెంబి మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఖానాపూర్‌లో ఎమ్మెల్యే రేఖానాయక్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శంకర్, తానాజీ, సూదుల శంకర్ తదితరులు ఉన్నారు.



భైంసాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: ప్రత్యేక రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రైతు సంక్షేమమే లక్ష్యంగా సాగునీటికి అధిక ప్రాధాన్యతనిచ్చారని ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి దినోత్సవం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు కాళేశ్వరం వంటి బృహత్ ప్రాజెక్టు నిర్మించారన్నారు. మిషన్ కాకతీయతో చెరువుల్లో పూడిక తీసి భూగర్భజలాలు పెంచేలా కృషి చేశారన్నారు. జెడ్పీ సీఈవో సుధీర్, డీఎస్‌ఈ జె.మన్సర్‌రావు, డీఈఈలు జె.అనిల్, రంజిత్‌కుమార్, జె.నవీన్‌కుమార్, ఏఈఈలు రమేశ్, శ్రీకాంత్, సర్ఫరోద్దీన్, సుదర్శన్ పటేల్, నాయకులు సోలంకి భీంరావు, రమేశ్, బుచ్చన్న, సురేందర్‌రెడ్డి తదితరులున్నారు.

యువతి వివాహానికి చేయూత

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన సట్ల భూమన్న కూతురు అనూష వివాహానికి మంత్రి ఐకేరెడ్డి వ్యక్తిగత సహాయకుడు కృష్ణంరాజు దంపతులు బుధవారం పసుపు, కుంకుమ, పుస్తె, మట్టెలు అందజేశారు. పంబాల భీమన్న, బీసీ రమేష్, రాజన్న, ప్రసాద్, దివాకర్, రవి, శేఖర్, రాజేందర్ తదితరులు ఉన్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు భూక్యా జాన్సన్‌నాయక్ సైతం అనూష వివాహానికి సాయంగా రూ.5,116 అందజేశారు.

ఆర్థికంగా ఎదగాలి

కుంటాల: మహిళలు పొదుపు చేసి ఆర్థికంగా ఎదగాలని సీసీ యూసుఫ్ పేర్కొన్నారు. బుధవారం కుంటాల శ్రీరామకృష్ణ గ్రామైఖ్య సంఘంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, రుణాలు, చెల్లింపులపై చర్చించారు. పంచాయతీ కార్యదర్శి రాజాబాపు, గ్రామైఖ్య అధ్యక్షురాలు సురేఖ, వీవోఏ దేవన్న, కార్యదర్శి సుమాలిని తదితరులున్నారు.

'గద్దె దించడమే లక్ష్యం'

లోకేశ్వరం: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీసీలు ఐక్యంగా పోరాడాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని లక్ష్మి కల్యాణ మండపంలో ఓబీసీ మోర్చా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ నాయకులు దడిగే భోజన్న, మల్లేశ్, శ్రీనివాస్, నల్ల రమేశ్, సుమన్‌కుమార్, మురళిగౌడ్, నరేశ్, గోపి, శ్రీకాంత్‌గౌడ్ తదితరులున్నారు.

'నిరాధార ఆరోపణలు సహించేది లేదు'



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ అహ్మద్

భైంసాటౌన్: భైంసా పట్టణంలోని ఏడీఏ కార్యాలయ సమీపంలో సర్వే నం.330/2లో చేపడుతున్న దుకాణ సముదాయం నిర్మాణ విషయమై తనపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్ హెచ్చరించారు. సదరు స్థలం విషయమై కొందరు పనులు అడ్డుకుని, తనపై ఆరోపణలు చేసిన వీడియో ఓ యూట్యూబ్ చానల్‌లో ప్రసారమైందన్నారు. ఈ విషయమై బుధవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భైంసా పట్టణం గతంలో నాందేడ్ జిల్లాలో ఉన్నప్పుడు సర్వే నం.330లోని 9.9 ఎకరాల భూమి అబ్దుల్లాఖాన్ అనే వ్యక్తి పేరిట పట్టా ఉండగా, అందులోని 5.9 ఎకరాలను ఆర్టీసీ బస్టాండ్ కోసం, ఓ ప్రైవేట్ వ్యక్తికి విక్రయించినట్లు పేర్కొన్నారు. మిగతా 4 ఎకరాలను మున్సిపల్ బైల్‌బజార్ కోసం రూ.340.12 చలానా రూపంలో చెల్లించి ప్రభుత్వం మున్సిపల్ పరం చేసిందన్నారు. బైల్‌బజార్ నిర్మాణం సాధ్యం కాకపోవడంతో అందులోని 30 గుంటల స్థలంను 2001లో ఈసేవా కేంద్రంతోపాటు దుకాణ సముదాయం, వ్యవసాయగోదాంల కోసం కేటాయించినట్లు తెలిపారు. 2018లో అప్పటి కలెక్టర్ ప్రశాంతి మిగిలిన 375 చదరపు గజాల స్థలాన్ని ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించిందన్నారు. సదరు స్థలంలోనే ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మంజూరు చేయించిన రూ.75లక్షలతో ప్రస్తుతం దుకాణ సముదాయం నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సదరు స్థలం ప్రభుత్వానిదేనని.. నిబంధనల ప్రకారం చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ స్థలం విషయమై కొందరు పలుమార్లు హైకోర్టులో పిటిషన్ వేయగా న్యాయస్థానం కొట్టివేసిందన్నారు. తనను రాజకీయంగా అప్రతిష్టపాలు చేసేందుకు ఆరోపణలు చేసిన వారికి లీగల్ నోటీసులు పంపినట్లు తెలిపారు.

'ప్రజాగర్జన' పోస్టర్ ఆవిష్కరణ



ముధోల్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

ముధోల్: కొత్తగూడెంలో నిర్వహించే సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బీజేపీ హటావో దేశ్‌కో బచావో కార్యక్రమానికి సీపీఐ పిలుపునిచ్చిందన్నారు. సభకు కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొండిబా, అహ్మద్, మసూద్ దత్తు తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: కొత్తగూడెంలో ఈనెల 11న జరిగే సీపీఐ ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి విలాస్ కోరారు. ఈ మేరకు బుధవారం భైంసాలోని మిర్చి మార్కెట్ యార్డులో కార్మికులతో కలిసి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో శివాజీ, ముత్యం, సట్వాజి, త్రిశరణ్, విఠల్ తదితరులున్నారు.

సర్కారు పాఠశాలకే పంపించాలి



సోన్‌లో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు



ఖానాపూర్: సత్తన్‌పల్లిలో ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: విద్యార్థులను సర్కారు పాఠశాలలకే పంపించాలని ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని పీచర, రాచాపూర్, నర్సాపూర్, వడ్యాల్ గ్రామాల్లో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు తిరుగుతూ పిల్లలను సర్కారు బడులకే పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు వివరించారు.

సోన్: మండల కేంద్రంలో జెడ్పీఎస్‌ఎస్ సోన్ పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం బడిబాట నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు గజ్జారం, ఉపాధ్యాయులు తమ బైక్‌లకు స్టిక్కర్లు వేసుకొని వినూత్న ప్రచారం చేశారు. రవికాంత్, అశోక్, రమేశ్, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: బడిబాటలో భాగంగా బుధవారం మండలంలోని ఓలా పంచాయతీ పరిధిలోని రాజాపూర్ తండాలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో వసతులను తల్లిదండ్రులకు వివరించారు. కుంటాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గజపల్లి నర్సయ్య, ప్రధానోపాధ్యాయులు సోమేశ్వర్, ఉపాధ్యాయులు నయిద్ పాషా, లక్ష్మీ, భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని సత్తనపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సత్తనపల్లిలో బడిబాట నిర్వహించారు. శంకర్, రాజేందర్, గంగన్న ఉన్నారు.

కడెం: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం మొర్రిగూడెం, బెల్లాల్, చిట్యాల్, నర్సింగాపూర్ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు గంట క్రాంతి, లక్ష్మణ్, వెంకట్రాములు, కృష్ణ ఉన్నారు.

చెరువుల పండగ విజయవంతం చేయండి

లోకేశ్వరం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అన్ని గ్రామాల్లో నిర్వహించే చెరువుల పండుగను విజయవంతం చేయాలని ఎంపీడీవో సోలామాన్ రాజ్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉదయమే గ్రామాలకు వెళ్లి పండగ ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని 22 గ్రామాల్లో గురువారం సాయంత్రం చెరువుల పండగ నిర్వహించాలని ఎంపీవో మోహన్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

ముధోల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న ఊరూరా నిర్వహించే చెరువుల పండుగను విజయవంతం చేయాలని ఎంపీడీవో సురేశ్‌బాబు అన్నారు. బుధవారం కార్యాలయంలో కార్యదర్శులు, నోడల్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి జీపీకి రూ.25 వేలు కేటాయించామని.. చెరువు పండుగ నిర్వహించాలని కోరారు.

'ఉత్సవాల పేరిట ప్రజాధనం దుర్వినియోగం'

ఖానాపూర్: ప్రభుత్వం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనం దుర్వినియోగం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, ఉట్నూర్ జెడ్పీటీసీ రాథోడ్ చారులత అన్నారు. బుధవారం ఖానాపూర్ ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాలతో పాటు, కొనుగోలు కేంద్రాల్లో దోపిడీతో రైతులు నష్టపోతుంటే ప్రభుత్వం మాత్రం ప్రజాధనం ఖర్చు చేస్తూ సంబురాలు చేసుకుంటుందన్నారు. ఖానాపూర్, కడెం మండలాల రైతుల జీవనాధారమైన సదర్మాట్ ప్రత్యేక కాలువ ఏర్పాటుపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. కడెం ప్రాజెక్టు వరదల్లో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలన్నారు. ఖానాపూర్‌లో రెవెన్యూ డివిజన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. తరి శంకర్, సీహెచ్ భవాని, గంగ నర్సయ్య, దయానంద్, రమేశ్, సత్యం, గద్దం గీత, జహీర్, మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి



ఎస్సైకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సారంగాపూర్: అంబేద్కర్‌తోపాటు ఎస్సీలను కించపరిచేలా సామాజిక మాధ్యమంలో పోస్టు చేసిన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం రాంపూర్‌కు చెందిన మోతె భూమేశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ అంబేద్కర్ సంఘం మండల నాయకులు బుధవారం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సదరు వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు పిల్లి నాగయ్య కోరారు. వారి వెంట సంఘం నాయకులు శ్రావణ్, బొడ్డు నరేశ్, ముత్యం, మురళీధర్, లక్ష్మణ్, సాయన్న, సుచిత్ కల్యాణ్, నరేశ్, శంకర్ తదితరులు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సోన్: తెలంగాణ ప్రభుత్వం కులవృత్తులు చేసుకునే బీసీలకు అందించే రూ.లక్ష సాయం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో మోహన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 9నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని.. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమాజ సేవకుడు



గ్రామంలో అంబలి పోస్తున్న గంగన్న

- ఆదర్శంగా నచ్చన్‌ఎల్లాపూర్ సర్పంచ్
- ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహణ
- ఏటా రూ.ఐదు లక్షల వరకు ఖర్చు చేస్తున్న వైనం

కడెం: సమాజం మనకు ఏమిచ్చిందని కాకుండా.. సమాజానికి మనం ఏం ఇస్తున్నామని ఆలోచించి నలుగురి ఉపయోగపడే పనులు చేస్తూ సేవా పథంలో ముందుకు సాగుతున్నాడు కడెం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ సర్పంచ్ గంగన్న. ఓ వైపు సర్పంచ్‌గా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ.. మరోవైపు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడిగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఉన్నతాధికారుల ప్రశంసలు..

మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న కృషితో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకెళ్తోంది. ఇప్పటికే రెండుసార్లు జిల్లాలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. పారిశుధ్య నిర్వహణ, వందశాతం ఓడీఎఫ్, పచ్చదనం, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవడంతోపాటు పంచాయతీ కార్యాలయాన్ని సుందరవనంగా తీర్చిదిద్దారు. దీంతో ఉన్నతాధికారులు గ్రామంలో పర్యటించి జరుగుతున్న అభివృద్ధిని చూసి సర్పంచ్‌ని ప్రశంసించారు. స్టడీ టూర్‌లో భాగంగా సివిల్ సర్వీస్ అధికారులు గ్రామంలో ఐదు రోజుల పాటు పర్యటించి పలు అంశాలను అధ్యయనం చేశారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ఇటీవల కడెం, దస్తురాబాద్ మండలాల పంచాయతీ కార్యదర్శులు ఈ గ్రామంలో ఫీల్డ్ విజిట్ చేసి పలు అంశాలు వివరంగా తెలుసుకున్నారు.



మంత్రి చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకుంటున్న గంగన్న (ఫైల్)

గంగన్న చేపట్టిన కార్యక్రమాలివీ..

- 2012లో బొడ్డు గంగన్న స్పందన అనే స్వచ్ఛంద సంస్థను నెలకొల్పాడు. అప్పటి నుంచి ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ దాతృత్వం చాటుకుంటున్నాడు.
- ప్రయాణికుల కోసం గ్రామంలో రూ. లక్షతో బస్‌షెల్టర్, నీటి ట్యాంక్ నిర్మించారు.
- గ్రామంలో గురుకుల విద్యార్థులను కోతుల బారి నుంచి కాపాడేందుకు రూ.20 వేలు ఖర్చు చేసి కొండముచ్చును తీసుకొచ్చి సమస్య పరిష్కరించాడు.
- కరోనా లాక్‌డౌన్ సమయంలో కడెం, ఖానాపూర్, దస్తురాబాద్ మండలాల్లో ప్రజలకు మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేసి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.
- పదేళ్లుగా గ్రామంలో ప్రధాన రహదారి పక్కన వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.
- రెండేళ్లుగా గ్రామంలో, ఈ ఏడాది నుంచి మండల కేంద్రంలోనూ సుమారు రూ.నాలుగు లక్షలు వెచ్చించి వేసవిలో రెండు అంబలి కేంద్రాలను ఏర్పాటు చేశారు.
- ప్రతి సంవత్సరం 50 మంది గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తారు. ఏటా సేవా కార్యక్రమాల కోసం రూ.ఐదు లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు గంగన్న తెలిపాడు.

సేవలోనే సంతృప్తి

స్పందన స్వచ్ఛంద సంస్థ ద్వారా పదేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. మా అమ్మ సర్పంచ్‌గా ఉన్నప్పటి నుంచి సేవ కొనసాగిస్తున్నా. సంస్థ వ్యవస్థాపకుడిగా నలుగురికి సాయపడుతున్నా.. సేవలోనే సంతృప్తి ఉంది. గ్రామస్తుల సహకారంతో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది.

– గంగన్న, సర్పంచ్, నచ్చన్‌ఎల్లాపూర్

అటెన్షన్ ప్లీజ్ లీకేజీని సరిచేయరూ



కుభీర్: మండల కేంద్రంలోని బట్టిగల్లీ హనుమాన్ మందిరం వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి నెల రోజులుగా తాగునీరంతా వృథాగా పోతుంది. నీటితో ఆ ప్రదేశంలో బురద ఏర్పడటంతో ఆలయానికి వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రాజన్న, భగీరథ ఏఈ, కుభీర్, ఫోన్: 99638 79579

అన్నప్రాసన

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పలువురు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు ఉన్నారు.